కథానిక

# దిగివచ్చిన సీతమ్మ

కొమ్మూరి పద్మావతీదేవి

ఆ ఊరికంతటికీ సీతమ్మగారు ఉత్తమ సాధ్విగా పేరు పొందింది. కొంతమంది పుట్టుకతోటే పేరుతోపాటు బిరుదులుకూడా పొంది, పేరు పొంది ప్రసిద్ధికి వస్తారు. అలాంటి పుణ్యమూర్తి సీతమ్మ.

ఏదైనా మహా పట్టణాలు వెళితే చూడవలసిన వాటికై జనం ఎంత తొందరపడి వెడతారో సీతమ్మగారినికూడా అలాగే చూడాలని ఊళ్ళనించి వస్తూఉంటారు. ఎవరికి ఏ సలహాలు కావలసినా ఆమెదగ్గిరకి పరుగెత్తుతారు. ఏ ఇంట వివాహం జరిగినా వధూవరులు సీతమ్మగారి ఇంటికివచ్చి ఆశీర్వాదంపొంది మరీ వెళ్లతారు. సీతమ్మ ఇల్లు దేవతామందిరం. సీతమ్మ గుమ్మం దాటదు. గుమ్మందాటగా ఎవ్వరూ ఎప్పుడూ చూడలేదు. గాని ఆమెలో అంత మహత్తు కస్తూరి పరిమళంలా అందరినీ ఇట్టే చుట్టివేసింది. ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడదు. మాట్లాడిన నాలుగు మాటలు ఏరికూర్చిన ముత్యాలలా ఉంటాయి. ఆ మాటలు మననంచేసుకుంటూ వెళ్లిపోతారు. ఎవ్వరుగాని తిన్నగా ఆమెముఖం చూసి ఏదీ అడగలేరు. సీతమ్మగారిలోఉన్న శక్తి ఏమిటీ అంటే ఎవ్వరూ చెప్పలేరు. చెప్పరు. ఏ చదువులూ రాకపోయినా అంతమందినీ తన దగ్గిరగా రప్పించుకోగలిగిన మహత్తరమైన ఆకర్షణకలది సీతమ్మగారు.

సీతమ్మగారి విగ్రహం పొడుగూ పొడుక్కి తగిన లావు. కళ్లు అంత పెద్దవికాకపోయినా కాటుకతో మెరిసిపోయే ఆ కళ్ళూ, ఆమె వంటి రంగూ ఏదో ఆకర్షణగా, మెరుపులా మెరిసి పోతూ ఉంటుంది. ఎక్కడా వెలితిలేని ఆమె రూపు నిండుగా గంభీరంగా ఉంటుంది.

ముత్యాల కమ్మలు, రాళ్ళబేసరి, మెళ్ళో నల్ల పూసలు ఒకటిరెండు నగలు. తీర్చినట్లున కనుబొమల వంపులు, గులాబీ రేకుల్లాంటి చిన్ననోరూ మహారాష్ట్రపుముడీ, ఎంతో ఠీవిగానడిచే ఆమె నడక ఏదోఒక రాచకన్య దారితప్పి వచ్చినట్లుగా కనపడుతుంది.

సీతమ్మగారి మొగుడు శీను తాలూకా కచేరిలో గుమాస్తా. అతను ఆపనికే పుట్టినట్లుగా కనపడతాడు. శీను వీధిని పోతూఉంటే "అడుగో సీతమ్మగారి మొగుడు" అంటూ వింతగా చూడక మానరు. సీతమ్మ ఎంత ఉదాత్తంగా ఉంటుందో శీను అంత అల్పంగా కనపడతాడు. లావుగా పొట్టిగా దొర్లుతూన్నట్లు నడిచే అతని వికృతశరీరం. దానికితోడు ఎవ్వరితో ఏం మాట్లాడినా ఎంతసేపూ తిండీ వాటి రుచులూ అర్థంకాని అవకతవకలూ ఆగకుండా వాగుతూ ఉండటం. ఇన్ని మంచి లక్షణాలతో అతను సీతమ్మగారి మొగుడు శీనుగా పేరుపొందాడు.

కొత్తగా ఆ ఊరికివచ్చిన వెంకటరావు భార్యని తీసుకుని సీతమ్మ దర్శనానికై కాచుకున్నాడు.

అది పెద్ద అరుగుల ఎత్తుఇల్లు. గుమ్మం దాటగానే కుడివైపున పెద్ద మామిడిచెట్టు. ఎడంవైపు వేపచెట్టు. చిన్న చిన్న చెట్లతో నిండిన పూలతోట దాటితే లోపలగా చిన్న ఇల్లు. ఎవ్వరు సీతమ్మని చూడాలన్నా మామిడిచెట్టుకింద బెంచీలమీద కూచుని ఎదురుచూస్తూ ఉండవలసిందే. ఒకప్పుడు దర్శనం త్వరగా కావచ్చు, గంటలుపట్టవచ్చు. సీతమ్మ వచ్చేవరకూ ఆమెకూచునే కుర్చీనిచూస్తూ లోపలనించి ఏ అలికిడి ఐనా, ఆమె వస్తూందేమో అనుకుంటూ కూచోడం అందరికీ అలవాటు అయిపోయింది.

"వస్తున్నారు" అన్నాడు చాకలి వీరాయి. వెంకటరావూ శారదా భక్తిగా లేచి నిలబడ్డారు. చేతిలో పూజాపళ్లెంతో అతిగంభీరంగా నడుస్తూ వచ్చింది. ఆమె పాదాల అలికిడి గుర్తుపట్టినట్లు పూలచెట్లుకూడా వంగి వాలి ఆహ్వానించాయి. పారిజాతంచెట్టు సీతమ్మతలమీద పువ్వులు రాల్చింది.

కొప్పుపక్కగా తలమీద నిలిచిన పారిజాతాలు చంద్రవంక పెట్టుకున్నంత అందమిస్తున్నాయి. సీతమ్మ పాదాల పసుపు తగిలితేనే చాలనుకొని శారద వంగి పాదాలు తాకి కళ్ళకి అద్దుకుని నమస్కరించింది. పళ్ళెంలోని పూలు శారద చేతిలో పెట్టి, రెండుపళ్ళూ ఇద్దరికీ ఇచ్చి పక్కనే ఉన్న కుర్చీలో కూచుంది సీతమ్మ, దంపతులు ఒకరినొకరు చూసుకున్నారు.

"మిమ్మల్ని ఒకమాట...అడగాలని" అంటూ గొణిగాడు వెంకటరావు.

"అడగండీ" అన్నది అతి ఆప్యాయంగా సీతమ్మ.

"మా పెళ్లిఅయి ఎనిమిదిసంవత్సరాలు దాటింది. సంతానంకోసం వెయ్యి దేవుళ్ళకి మొక్కాం. ఏంచేస్తే...మాకు..." అంటూవున్న వెంకటరావు మాటల్ని మధ్యలోనే ఆపి వేళ్ల ఉంగరాలు సరిచేసుకుంటూ నవ్వుతూ,

"మంచిపేరున్న ఆడ డాక్టరుకి చూపించండి ఆమె ఏం చెప్పిందీ నాకు చెప్పండి" అంటూ లేచి నిలబడింది సీతమ్మ. దంపతులు ఇద్దరూ భయభక్తులతో సీతమ్మ పాదాలకు నమస్కరించి వెళ్లిపోయారు. ఇంకా వచ్చిన జనానికి తోచిన సమాధానాలు ఇస్తూనే ఉంది సీతమ్మ.

ఆ రోజున చాలామంది చోటుచాలక నిలబడి సీతమ్మ రాకకై కనిపెట్టుకున్నారు.

ఇంతలో పాముకూసంలాంటి పట్టుచీర ఎర్రని రవిక, జారుముడీ, తల్లోంచి జారిన పూలదండ భుజాలమీద పడుతూ వనదేవతగా వచ్చి నిలబడింది సీతమ్మ. అంతా లేచారు. నవ్వుకుంటూ అందరినీ కూచోమని సంజ్ఞచేస్తూ తనూ తన కుర్చీలో కూచున్నది. ఎన్ని సంగతులో అడగాలని వచ్చిన అందరూ ఆమెని చూస్తూ ఏం అడగాలో మరిచిపోయి తలలు వంచుకుని ఏదో ధ్యానంలో ఉన్నట్టు నిశ్శబ్దంగా కూచుండిపోయారు. జనం మధ్యనించి తోసుకుంటూ వెంకటరావు శారదా సీతమ్మదగ్గిరగా వచ్చారు. వస్తూనే సీతమ్మ పాదాలమీద పడి

"మీ దయవల్ల నా భార్య గర్భిణి. నాకు పుట్టబోయే బిడ్డకి మీ పేరు పెట్టుకుంటా" అంటూ మళ్ళీ నమస్కరించి నమ్రతగా పక్కగా నిలబడ్డాడు వెంకటరావు.

"సీతమ్మ ఇచ్చిన వరం, ఆ దేవత. మహాలక్ష్మి ఈమెలో ఉన్నది" అన్నారు గుంపులో కొందరు. చాకలి వీరాయి సీతమ్మదగ్గరగా వచ్చి ఏదో మెల్లిగా చెప్పాడు. ఆమె ఏం చెప్పిందో గాని పెద్ద కారుగుమ్మంలో ఆగింది. అంతా ఒక్కసారిగా మహారాజుగారు, రాణిగారు అన్నారు, రాజుగారూ రాణిగారూ పళ్లు తీసుకుని సీతమ్మదగ్గిరగా వచ్చారు. పైజామా సిల్కులాల్చీతో ఉన్న రాజుగారు భక్తితో చేతులు జోడించి సీతమ్మని నమస్కరించి పక్కగా నిలబడ్డాడు. దాసీలు అందించిన పసుపూ, కుంకమూ, పూలూ సీతమ్మ పాదాల మీద ఉంచి, పూజించి లేచి రాజు పక్కగా నిలబడింది రాణి. సీతమ్మ ఆదరంతో చూసి నవ్వుతూ చేతితో చూపిన బెంచీమీద కూచున్నారు రాజదంపతులు. వచ్చిన వారంతా వింతగా భయంతోనూ ఆసక్తితోనూ వచ్చినవారినీ, సీతమ్మనీ రెప్పవాల్చకండా చూస్తున్నారు.

"మీరు ఒక్కసారి మా రాజభవనానికి రావాలి. మాయిల్లు పావనం చెయ్యాలి!" అంటూ రాజుగారు అతినమ్రతగా అడిగేసరికి సీతమ్మ కనుబొమలు చిట్లించి తలవంచుకుని,

"గుమ్మం కదలివచ్చే అలవాటు నాకులేదు. రాలేనందుకు ఏమీ అనుకోకండి."

"ఎంతమాట! ఎంతమాట! అయితే మేమే మీ దర్శనానికి వస్తూ ఉంటాము. శలవయ" అంటూ లేచేసరికి రాణి సీతమ్మ దగ్గరగా వచ్చి,

"నేను తమతో చెప్పుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి. మీరు ఒంటరిగా... మీ సలహా" అంటూ మెల్లిగా కళ్లు ఆర్పుతూ రహస్య ధోరణిలో అనేసరికి,

"మీ యిష్టం వచ్చినవేళకి రావచ్చు" అంటూ సీతమ్మలేచి అందరికీ అందని అతీతురాలుగా దేవతామూర్తిలా నడిచి లోపలికి వెళ్ళిపోయింది. తలుపులు మూసుకున్నాయి, జనంతో పాటు కారు కూడా కదిలింది.

రాణీ లక్ష్మిబాయి అన్నారు ఒకరు. ఏదో దేవత మనఊరిలో వెలిసింది అన్నారు మరిఒకరు. రాణీగారు చేసిన పాదపూజ చెప్పుకుంటూ ఆడవాళ్లు ఆనందపడ్డారు.

ఆ గుంపుని తప్పించుకుంటూ సీతమ్మగారి మొగుడు శీను తొందరగా ఆఫీసుకి వెళ్లిపోయాడు.

ఆ రోజున విజయదశమి. ఎంతోమంది ఏవో కానుకలతో మోయలేని బరువులతో నిండిపోయారు.

"అమ్మగారు ఉత్త చేతులతో వస్తేనేగాని దర్శనమివ్వరు" అన్నాడు వీరాయి.

అందరూ నిరాశగా వెనక్కి తిరగబోతూ ఉండగా రాజుగారు, రాణీగారు, పళ్ళేలలో నింపిన పళ్ళూ పూలూ ఫలహారాలతో దిగారు. రాణిగారి చేతులతో మెరిసిపోతూన్న రవ్వలూ పచ్చలు పొదిగిన బంగారుభరిణ, అంతా అటువైపు తిరిగారు.

బంగారపురంగు పట్టుచీరె, నల్లనిరవికా తల నిండా పూలు, మెడనిండుగా నగలు ఇప్పుడే ఆకాశంనించి దిగివచ్చిన గంధర్వ కన్యగా నిర్మలంగా నడిచివచ్చింది సీతమ్మ.

సీతమ్మ కూచోగానే అందరూ కూచుండిపోయారు. యథావిధిగా రాణి సీతమ్మ పాదాలని పూజించి, పట్టుచీరెతో విలువగల నగలతో నిండిన వెండి పళ్ళెం ఆమె చేతులకి అందించింది. సీతమ్మ ఆ పళ్ళాన్ని ముట్టుకోలేదు వద్దన్నట్టు తల తిప్పింది. ఈసారి రాజు సీతమ్మ పాదాల మీద వాలి మత్తుగా లేచి కళ్ళు మూసుకుని నిలబడ్డాడు.

"ఒక్కసారి ఒంటరిగా" అన్నది రాణి.

సీతమ్మ వచ్చిన అందరినీ చూసి "రాణీగారు తెచ్చినవన్నీ అందరికీ పంచిపెట్టు వీరాయి" అంటూ లేచింది.

సీతమ్మ వెనక రాణీ, రాణీ వెనక రాజూ ముగ్గురూ లోపలికి వెళ్ళగానే తలుపులు మూసుకున్నాయి. ఆ దేవతామందిరంలో భక్తులు ఎంతసేపు ఏం చేశారోగాని తలుపులుమాత్రం త్వరగా తెరుచుకోలేదు.

రాజ బంధువులూ, రాజ దంపతులూ తరుచు సీతమ్మ దర్శనానికి రావటం సలహాలు తీసుకోటం మామూలు అయిపోయి అంతా వింతపడిమాడటం మానివేశారు.

సీతమ్మ ఫోటో రాజ మందిరంలోని పూజా మందిరంలో ఉందనీ సీతమ్మని ఆరాధించనిదే ఏపనీ చెయ్యరనీ అందరూ అనుకున్నారు.

రాజుగారి చెల్లెలి వివాహం, ఊరు ఊరంతా అద్భుతంగా అలంకరించారు. పందిళ్లువేశారు. అతి వైభవంగా కన్నుల పండువుగా వివాహం జరిగింది. సీతమ్మ సలహాప్రకారం ఈసారి ప్రజలందరికీ రాజమందిరంలో విందులేకాక కానుకలు కూడా ఇచ్చి పంపారు. సీతమ్మ తల్లి చలువ అనుకుంటూ చెమ్మగిల్లిన కళ్ళతో పేదప్రజలు ఇల్లు చేరుకుంటున్నారు. వధూవరులు సీతమ్మ ఇంటికి వస్తున్నారన్న వార్త విని జనం విరగబడి పోయారు. ఊరుజనం యావత్తూ సీతమ్మ యింటిముందు చేరారు. గోడలూ చెట్లూ ఎక్కి కూచున్నారు. పోలీసులు జనాన్ని ఆపలేక కష్టపడుతూన్న ఆ సమయంలో వధూవరులు రాజుగారి సహాయంతో సీతమ్మయింట్లో అడుగు పెట్టారు.

చాకలి వీరాయి ఏడుస్తూ ఎదురయి "అమ్మ... అమ్మకనపడ్డంలేదు బాబూ!"



"ఎప్పటినించీ?" అన్నారు రాజుగారు ఆందోళనగా.

"రాత్రిచూశాను బాబూ! తెల్లారేసరికి..." అంటూ పసివానిలా ఏడవటం మొదలుపెట్టాడు మాటలురాక.

రాజూ, రాజువెంట పరివారం, పోలీసులూ ప్రజలూ తిరిగారు. సీతమ్మజాడ తెలియలేదు.

"భక్తురాలు. పూజామందిరంలో ఐక్యం అయిపోయి ఉంటుందన్నారు" జనం ఈ వార్త విని ఏడుస్తూ సీతమ్మతల్లీ అంటూ అరుస్తూ ఎంత ఆపినా ఆగకుండా ఇంట్లో ప్రవేశించారు.

అప్పటికప్పుడే ఊరుజనం యావత్తూ పసుపూ కుంకమూ, పూలూ, కొత్తచీరెలు ఎవరికి తోచినది వారు తీసుకుని ఒకటేధోరణిగా దొడ్డుమీదా మామిడిచెట్టుకిందా నింపేశారు. ఆఖరుసారిగా సీతమ్మతల్లికి కానుకలు వెయ్యాలని వచ్చిన వధూవరులు జనతొక్కిడిలో నలిగిపోయి వెనక్కి వెళ్లిపోయారు.

జనసమూహం అంతా ఏడుస్తూ ఆకాశం వంకా సీతమ్మ ఇంటివంకాచూస్తున్నారు. ఏదైనా దివ్యసందేశం వస్తుందా అన్నట్టు. సీతమ్మగారి మొగుడు శీను చుట్టలకట్ట చేత్తోపట్టుకుని తిన్నగా ఇంట్లోపలికి వచ్చాడు. అందరూ అనేకవిధాల ప్రశ్నించారు. అతనిచుట్టూ గుంపుచేరిపోయారు. వెకలిగా నవ్వుతూ,

"నాకు తెలియదే. మీలాగే నేనూవింటున్నా" అన్నాడు నానుస్తూ. సీతమ్మ పోగానే శీనుకి వెర్రెత్తింది అన్నారు ఒకరు. ఎవరికితోచినమాటలు వారు ఆ గుంపులో అనుకోటం మానలేదు. బాగా ఎండ యెక్కింది.

సీతమ్మ జాడ తెలియలేదు. సీతమ్మ కూచునే కుర్చీకి పూలదండలు వేసి పూజలుచేశారు. ఒకరినొకరు తోసుకుంటూ మామిడిచెట్టు కింద ఒక దివ్య దేవతామూర్తిని ప్రతిష్ఠ చేశారు. పసుపూ, కుంకమూ పూలూ రాసులుగాపోసి, కన్నీళ్ళతో కష్టసుఖాలు చెప్పుకుంటున్నారు. సీతమ్మగారి మొగుడు శీనుమాత్రం వీధి అరుగుమీద కూచుని నాలుగుపక్కలా చూస్తూ ఏదో వాగుతున్నాడు. ఆ రాత్రి ఆ ఊరు శ్మశానంగా మారింది. ఊరంత శూన్యంగా కనిపించింది; ఎవరి ఇంట్లో దీపాలు వెలగలేదు. అంత వెలుతురూ సీతమ్మ ఇంట్లో వెలిగింది -- అఖండాలు ఆరకుండా వెలుగుతున్నాయి.

మాటుమణిగిన ఊరు యావత్తూ తెల్లవారేసరికి గుప్పుమన్నది.

ఊరు చివరవ మామిడితోపులో సీతమ్మ చచ్చి పడి ఉందంటున్నారు. ఇసుకవేస్తే రాలని జనంతో మామిడితోపు అంతా నిండిపోయింది. చెట్టుమీద కొమ్మకొమ్మకీ జనం చేరారు. తల్లో వాడని పూలు, చెరగని బొట్టు, మెళ్ళో ఒంటి రంగుతో కలిసిన గంధం, నిద్రలో ఉన్నట్లుండి, సీతమ్మ మడత చెడని ఆమె పటుచీరె గాలికి ఎగురుతూ ఏ ధూళీ ముఖానికి రాకుండా చేస్తోంది.

రాజుగారు ఆమెనిచూడలేక కన్నీళ్లతో కారు ఎక్కారు.

ఊరు జనం సీతమ్మ తల్లిని ఆఖరుసారిగా వీధులన్నీ తిప్పుకుని ఇంటింట పూజించి పూలు చల్లారు. ఆ మామిడితోపులోనే సమాధి చేయటంతో జనం శాంతినిపొందారు.

ఆ ఊరికి వెళితే సీతమ్మ సమాధి చూడకండా రాలేము. సీతమ్మతోనే అంతరించిన ఆ నిగూఢ రహస్యం అప్పటికీ ఇప్పటికీ ఎవ్వరికీ తెలియదు.

సీతమ్మగారి మొగుడు శీనుమాత్రం సీతమ్మగారి ఇంట్లో ఇంకా అలాగే ఉన్నాడు.

---

సినిమాలకి మాటలూ-పాటలూ రాసి బాగా డబ్బు చేసుకున్న కవిగారొకాయన తన పెంపుడు రామచిలుకను చూసి ఒకనాడు, "నీకో బంగారం పంజరం చేయించి పెట్టనా?" అని అడిగాడు.

"అక్కర్లేదు. చిలకపలుకులు నాకంటె మీకే బాగావచ్చు; అంతేగాక మీ మాటలు విని ఆనందించేవాళ్లు వేరు!" అని చిలక సమాధానం చెప్పింది.